ప్రజాశక్తి

మంగళవారం 11 మార్చి 2025

5

పార్వతీపురం మన్యం

ఏకలవ్య పాఠశాలలో డిఇఒ తనిఖీ

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని దబ్బగెడ్డ పంచాయతీ పరిధిలోని అనసభద్రలో గల ఏకలవ్య పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్.తిరుపతినాయుడు సోమవారం సందర్శించారు. పాఠశాలల్లో జరుగుతున్న సిబిఎస్‌సి పరీక్షా తీరును ఆయన పరిశీలించారు. అనంతరం 12వ తరగతి విద్యార్థులతో ఆయన మాట్లాడారు. ఇంటర్మీడియట్‌లో విద్యార్థులు ఏ విధంగా ఉండాలన్న అంశాలపై వారికి సూచనలు ఇచ్చారు. పాఠశాలలోని సౌకర్యాలు, అలాగే ఇంకా కావాల్సిన సౌకర్యాలపై సిబ్బందితో చర్చించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత జిల్లాగా పార్వతీపురం : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో ప్లాస్టిక్ ను, చెత్తను పూర్తిగా నిషేధిస్తూ ప్లాస్టిక్‌రహిత జిల్లాగా పార్వతీపురంను తీర్చిదిద్దాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పలు అంశాలపై జిల్లా అధికారులతో కలెక్టర్ సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పురపాలక సంఘాలు, పంచాయతీల్లో దీనిపై ఒక తీర్మానం చేసి అమలు చేయాలని అన్నారు. ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధిస్తున్నట్లు బోర్డులు, ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలని సూచించారు. భవిష్యత్తులో పేపర్, క్లాత్ బ్యాగులను ప్రోత్సహించాలని, ఇందుకు స్వయం సహాయక బృందాలను వినియోగించుకోవాలని కలెక్టర్ వివరించారు. ప్లాస్టిక్ రహిత పార్వతీపురం జిల్లాలో భాగంగా తీర్మానం అమలైన తర్వాత ఎవరైనా ప్లాస్టిక్ వినియోగిస్తే, వారిపై జరిమానా విధిస్తామని కలెక్టర్ తేల్చి చెప్పారు. రోడ్లపై ఎక్కడా ప్లాస్టిక్, చెత్త కనిపించరాదని, ఆ దిశగా అధికారులు ప్రణాళికలు రూపొందించుకొని అడుగులు వేయాలని కలెక్టర్ తేల్చిచెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం వాట్సాప్ గవర్నెన్స్ ను ముందుకు తీసుకువచ్చిందని, వాట్సాప్ ద్వారా మనకు కావలసిన అన్ని రకాల సేవలను పొందవచ్చని కలెక్టర్ వివరించారు. ఈ విషయాన్ని డిజిటల్ అసిస్టెంట్లు తమ గ్రామాల్లోని ప్రజలకు వివరించి, వారు వాట్సాప్ ద్వారా సేవలు పొందేలా చైతన్యపరచాలని ఆదేశించారు. ఇకపై జిల్లా అధికారులు ప్రతి మంగళ, శుక్రవారాలు క్షేత్రస్థాయిలో పర్యటించాలని, అక్కడ పి4 కింద జరుగుతున్న సర్వే వివరాలను తెలుసుకోవాలని అన్నారు. ఈ సర్వే ఈ నెల 15 నాటికి పూర్తికావాలని తేల్చిచెప్పారు. ఇప్పటికే జిల్లాలో దాదాపు 30 శాతం సర్వే పూర్తయిందని, మిగిలిన 70 శాతం సర్వే ఈ వారం లోగా పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

జిల్లాలో గంజాయి, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, బాల్య వివాహాల నిర్మూలన వంటి తదితర అంశాలపై పటిష్ట చర్యలు చేపట్టేందుకు గ్రామ పంచాయతీ స్థాయిలో ఈగల్ యూత్ క్లబ్బులను ఏర్పాటుచేయాలని కలెక్టర్ చెప్పారు. వీరంతా ఆయా గ్రామాల్లో నాటుసారా,గంజాయి, మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టడం, బాల్యవివాహాల నిషేధం, రహదారి భద్రత తదితర అంశాలపై ఆయా గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కల్పిస్తారని వివరించారు. 45 మందికి పైగా విద్యార్థులు ఉన్న పాఠశాలలను మోడల్ ప్రైమరీ స్కూళ్లుగా పరిగణిస్తున్నారు. అలాగే 35 మంది కన్నా తక్కువగా ఉన్న పాఠశాలలను బేసిక్ ప్రైమరీ స్కూళ్లుగా పరిగణిస్తూ ఇద్దరు టీచర్లను మాత్రమే ప్రభుత్వం నియమిస్తుందని, తద్వారా అన్ని తరగతులను ఆయా ఉపాధ్యాయులే నిర్వహించాల్సి ఉంటుందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతి విద్యార్థి అపార్ ఐడి ఆధారంగా విద్యార్థులు పాఠశాలలకు వెళ్తున్నదీ, లేనిదీ పరిశీలించి, వివరాలు అందజేయాలని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ, ఇంచార్జి జెసి కె.హేమలత, ఎస్‌డిసి పి.ధర్మచంద్రారెడ్డి, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

అందరి భాగస్వామ్యంతో జిల్లా అభివృద్ధి

జిల్లాను అందరి భాగస్వామ్యంతో అభివృద్ధి పథంలో నడిపిద్దామని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆకాంక్షను వ్యక్తం చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పి-4, నియోజకవర్గ విజన్‌పై జిల్లా అధికారులు, స్వచ్ఛంద సంస్థలతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను కూడా భాగస్వాములను చేస్తూ పబ్లిక్, ప్రైవేట్, పీపుల్ పార్ట్నర్ షిప్ కింద పి 4 విధానానికి శ్రీకారం చుట్టిందన్నారు. నియోజక వర్గాల విజన్‌లో భాగంగా జిల్లాను అభివృద్ధి చేసేందుకు గల అవకాశాలపై స్వచ్ఛంద, ఇతర పలు సంస్థల అభిప్రాయాలను తెలియజేయాలని కలెక్టర్ కోరారు. సమావేశంలో సిపిఒ పి.వీరాజు, ఉమ్మడి జిల్లా పరిషత్ సిఇఒ ఆర్.వెంకట్రామన్, జిల్లా వ్యవసాయ, పశు సంవర్ధక, గ్రామీణ నీటి సరఫరా ఇంజినీరింగ్ అధికారులు కె.రాబర్ట్ పాల్, ఎస్. మన్మథరావు, ఒ.ప్రభాకరరావు, డ్వామా, ఐసిడిఎస్ పీడీలు కె.రామచంద్రరావు, టి.కనకదుర్గ, బీసీ సంక్షేమ అధికారి ఎస్.కృష్ణ, పరిశ్రమల కేంద్రం జిల్లా మేనేజర్ ఎం.వి.కరుణాకర్, వైద్య ఆరోగ్య శాఖాధికారి ఎస్. భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

చిరుద్యోగులను తిరిగి నియమించాలి

సిఐటియు ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి పార్వతీపురం

తొలగించిన మధ్యాహ్న భోజనం, స్కూల్ సీపర్లు, విఒఎలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, డైలీ వేస్, గ్రామ వార్డు సచివాలయం వాలంటీర్లను నియమించాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించిన అనంతరం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం కార్మికుల సంఘం అధ్యక్షులు జి.తులసి, కార్యదర్శి వై.శాంత కుమారి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మథరావు మాట్లాడుతూ ఇటీవల కాలంలో మన్యం జిల్లాలో చిరు ఉద్యోగస్తులపైన రాజకీయంగా కక్ష సాధిస్తూ వాళ్ల కుటుంబాల్ని రోడ్డుపై నెట్టేస్తున్నారన్నారు. బలిజిపేట మండలం అరసాడ, కొమరాడ మండలం కోటిపాం, పార్వతీపురంలోని కొత్తవలస పాఠశాలల్లో మధ్యాహ్న భోజన కార్మికులు, విఒఎలుపైన, డైలీ వేజ్ పైన కక్ష సాధింపులు భాగంగా తొలగించడం అన్యాయన్నారు. తొలగించిన వారిని విధుల్లో చేర్చుకోవాలని కోరారు. అలాగే గ్రామ వార్డు సచివాలయం వాలంటీర్లకు న్యాయం చేస్తానని, రూ.10వేలు వేతనం ఇస్తామని నమ్మబలికి వారికి ద్రోహం చేసింది కూటమి ప్రభుత్వమని, కావున తొలగించిన స్కీమ్ వర్కర్లు ఉద్యోగస్తులను నియమించాలని, హైకోర్టు ఉత్తర్వులు ప్రకారం బలిజిపేట మండలం అరసాడ హైస్కూలు, ప్రాథమిక మధ్యాహ్న భోజన కార్మికులు, సీపర్లు పాతవారిని కొనసాగించాలని హైకోర్టు ఉత్తర్వులను కూడా ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వీరికి ధర్నాకు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లి గంగు నాయుడు మద్దతు తెలియజేస్తూ మన్యం జిల్లాలో చిరు ఉద్యోగస్తులపైన రాజకీయంగా కక్ష సాధింపు చర్యలు దిగడం పద్ధతి కాదన్నారు. నియోజకవర్గ ఎమ్మెల్యే పేదల పొట్ట కొట్టడం తొలగించడం ఎంతవరకు సమంజసం ప్రశ్నించారు. పార్వతీపురం మున్సిపాలిటీ కొత్తవలసలో బలవంతంగా మధ్యాహ్న భోజన కార్మికులను తొలగిస్తున్నారని, జిల్లాలో చిరు ఉద్యోగస్తులపై ఇలా దాడి చేయడం పద్ధతి కాదన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులకు, స్కూల్ స్వీపర్లకు గుర్తింపు కార్డులు, యూనిఫాం, కాటన్ చీరలు, మౌలిక సదుపాయాలు, సబ్సిడీ గ్యాస్, గ్రూప్ ఇన్సూరెన్స్, ఉద్యోగ భద్రత కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం ధర్నా విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ ధర్నా వద్దకు వచ్చి కార్మికుల సమస్యలు విని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో శ్రామిక మహిళా సంఘం నాయకులు వి.ఇందిర, సిఐటియు కోశాధికారి జి.వెంకటరమణ, నాయకులు బి.సూరిబాబు, సంచాన ఉమా, డ్రైవర్ అమ్మ , భవాని, లక్ష్మి, పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు సమస్యలను వివరిస్తున్న సిఐటియు నాయకులు మన్మథరావు

పార్వతీపురం - బలిజిపేటకు బస్సు సౌకర్యం కల్పించాలి

ప్రజాశక్తి - బలిజిపేట

పార్వతీపురం నుంచి నారాయణపురం మీదుగా బలిజిపేటకు బస్సు సౌకర్యం కల్పించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం వారు మండలంలోని నారాయణపురం బ్రిడ్జి రోడ్డు పరిశీలించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు రెడ్డి వేణు నాయకులు మాట్లాడుతూ బ్రిడ్జి పనులు పూర్తయ్యాయని, దీంతో పార్వతీపురం జిల్లా కేంద్రానికి చేరుకోవడానికి చాలా దగ్గరగా ఉంటుందని అన్నారు. కావున పార్వతీపురం ఆర్‌టిసి డిపో మేనేజర్ పార్వతీపురం నుండి నారాయణపురం మీదుగా బలిజిపేట బస్సు సౌకర్యం కల్పించాలని, బస్సు సౌకర్యం లేక ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు అన్నారు. గతంలో పార్వతీపురం నుండి గౌరీపురం సువర్ణముఖి నది ఒడ్డుకు బస్సు వచ్చేదని ఇప్పుడు బ్రిడ్జి పూర్తయిన సందర్భంగా బస్సును నడపాలని కోరారు.

బ్రిడ్జి పరిశీలనలో సిపిఎం నాయకులు గేదెల సత్యనారాయణ, దన్నాన తిర్నాథ, రెడ్డి సూరి, యమ్మల మన్మథరావు పాల్గొన్నారు

మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

సమస్యలు పరిష్కరించనందుకే

మున్సిపల్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి - సాలూరురూరల్

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎన్నోసార్లు మున్సిపల్ కమిషనర్‌కు, చైర్‌పర్సన్‌కు స్థానిక మంత్రి సంధ్యారాణికి వినతి పత్రాల ద్వారా విన్నవించుకున్నా నేటికీ వాటిని పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్న కారణంగానే సోమవారం నుండి మున్సిపల్ కార్మికులు నిరవధిక సమ్మె చేపడుతున్నట్టు మున్సిపల్ కార్మిక వర్కర్స్ యూనియన్ నాయకులు టి శంకర్రావు, రాముడు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో కార్మికులతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొద్ది నెలల నుంచి మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న కనీస అవసరాలను తీర్చాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ సిహెచ్ సత్యనారాయణకు,మున్సిపల్ చైర్ పర్సన్ పువ్వల ఈశ్వరమ్మకు ఎన్నోసార్లు మొరపెట్టుకున్నామన్నారు. పాలకవర్గ సమావేశాలను కూడా అడ్డగించి డిమాండ్ చేసినా వాటిని అప్పటికప్పుడు పరిష్కరిస్తామని చెబుతూ నేటి వరకు పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్నందున ఈ సమ్మె నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు. మున్సిపల్ కార్మికులకు బకాయి జీతాలను ఇప్పించాలని, ప్రతినెలా ఒకటో తారీకున జీతాలు ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న ఫిబ్రవరి నెల జీతాలను వేయాలని, చనిపోయిన కార్మికుల కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరుతున్నా వీటిని పరిష్కరించడంలేదన్నారు. మంత్రి సంధ్యారాణి సొంత నిధులు ఇస్తామని, కార్మికుల కనీస అవసరాలైన సబ్బులు, నూనెలు, చెప్పులు నేటి వరకు కార్మికులకు అందించలేదని, మంత్రి కూడా మాట తప్పారని అన్నారు. తమ పరిష్కరించాలని కోరుతూనే ఈ సమ్మెను నిర్వహిస్తున్నామని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎన్వై నాయుడు, కార్మికులు పాల్గొన్నారు.

సమస్యలపై జాప్యం వహిస్తే సహించబోం : కలెక్టర్

పిజిఆర్ఎస్‌కు 136 వినతులు

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన దరఖాస్తులపై అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కారం ఉండాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్) కార్యక్రమం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో 136 మంది అర్జీదారుల నుంచి వినతులను కలెక్టర్ స్వీకరించారు. అనంతరం జిల్లా అధికారులతో ఆయన మాట్లాడుతూ పిజిఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలు త్వరితగతిన పరిష్కారం కావాలన్నారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి నాణ్యమైన పరిష్కారాన్ని అందించాలని పేర్కొన్నారు. అర్జీదారుల విజ్ఞప్తులను అధికారులు క్షేత్రస్థాయిలో స్వయంగా వెళ్లి పరిశీలించాలని సూచించారు. పారదర్శకంగా విచారణ చేసి, ఆపై అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోగా సమస్య పరిష్కారం కావాలని స్పష్టం చేశారు. పిజిఆర్ఎస్ విజ్ఞప్తులపై నిర్లక్ష్యం పనికిరాదని, జాప్యం జరిగితే సహించబోమని తెలిపారు. అలాగే దిగువ స్థాయి అధికారులను పంపి మొక్కుబడిగా పరిష్కారం చేస్తే ఉపేక్షించబోమన్నారు. వచ్చిన ప్రతి అర్జీని అధికారులు పరిశీలించి, ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, సరైన పరిష్కారం కాక, అర్జీ మళ్లీ రీఓపెన్ అయ్యే పరిస్థితి తలెత్తరాదని కలెక్టర్ తేల్చి చెప్పారు. కార్యక్రమంలో ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ, ఇన్‌ఛార్జి జెసి కె.హేమలత, ఎస్‌డిసి పి.ధర్మచంద్రారెడ్డి, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఐటిడిఎ పిజిఆర్ఎస్‌కు 61 వినతులు

స్థానిక ఐటిడిఎలో సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్‌కు 61 అర్జీలు వచ్చాయి. ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఐటిడిఎ ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గిరిజన ప్రజలు తమ సమస్యలపై వినతి పత్రాలను సమర్పించుకున్నారు. మొత్తం 61 మంది వినతి పత్రాలు సమర్పించారు. కార్యక్రమంలో ఇఇ రమాదేవి, పిహెచ్ఒ వెంకట గణేష్, డిప్యూటీ డిఇఒ రవి ప్రసన్న కుమార్, పశుసంవర్ధక శాఖ ఎడి శ్రీనివాసరావు ట్రాన్స్‌కో డిఇ గోపాలకృష్ణ, వెలుగు ఎపిడి సన్యాసిరావు, ఉపాధి హామీ ఎపిడి శ్రీహరిరావు సిడిపిఒ రంగలక్ష్మి , ఇతర సెక్టోరల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తులకు సత్వర పరిష్కారం చూపాలి : ఎస్‌పి

పార్వతీపురంరూరల్ : జిల్లా ఎస్పీ కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో దరఖాస్తులకు సత్వర పరిష్కారం చూపాలని ఎస్పీ ఎస్‌వి మాధవ్ రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 14 ఫిర్యాదుదారులు వచ్చాయి. అర్జీలను స్వీకరించి, అర్జీదారులతో ఎస్‌పి ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిసిఆర్‌బి. ఎస్సై ఫ్రక్రుద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.

సిఎస్ఆర్ కింద వసతి గృహాలకు యుబిఐ ఫర్నీచర్ వితరణ

పార్వతీపురంలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో వినియోగార్థం యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఫర్నీచరును అందజేసినట్లు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్ఆర్) కింద లక్ష రూపాయల విలువైన 4 బీరువాలు, 4 టేబుళ్లు, 4 విజిటింగ్ చైర్స్, 20 నీల్ కమల్ కుర్చీలను విరాళంగా అందించినట్లు చెప్పారు. యుబిఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ప్రాంగణంలో సోమవారం ఫర్నీచర్ వితరణ కార్యక్రమం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యాన జరిగింది. ఈ సందర్భంగా యుబిఐ శ్రీకాకుళం ప్రాంతీయ కార్యాలయం అధికారులు ఫర్నీచర్ ను కలెక్టర్‌కు అందజేశారు. వసతి గృహాలకు ఫర్నీచర్‌ను అందజేయడం పట్ల కలెక్టర్ హర్షం వ్యక్తం చేశారు.

రోగుల చెంతకే ఎక్స్‌రే మిషన్

గిరిజన ప్రాంతాల్లోని క్షయవ్యాధి రోగుల చెంతకే సంచార ఎక్స్ రే మిషన్ అందుబాటులోకి తీసుకువచ్చినట్లు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లో పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా విరాళంగా అందించిన సంచార ఎక్స్ రే మిషన్ యూనిట్‌ను కలెక్టర్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల్లో క్షయవ్యాధి గ్రస్తులు ఎక్కువగా ఉన్నారని అన్నారు. అటువంటి వారంతా ఇకపై ఎక్స్ రే కోసం పార్వతీపురం ప్రభుత్వాసుపత్రికి రావాల్సిన అవసరం లేదన్నారు. ఈ మిషన్ ద్వారా రోగుల ఇంటి వద్దనే ఎక్స్‌రే తీసుకునే సౌలభ్యం అందుబాటులోకి వచ్చిందని చెప్పారు. శరీరంలోని ఏ భాగాన్ని అయిన ఎక్స్‌రే తీసుకోవచ్చని, దీంతో రోగులకు సేవలు మరింత సులభతరం అవుతుందని అన్నారు. రూ.30 లక్షల విలువ గల ఈ యూనిట్‌ను షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కమాండర్ వై.ఫణీంద్ర విరాళంగా అందించారని కలెక్టర్ ఈ సందర్భంగా ఆయనకు అభినందనలు తెలిపారు.

అటవీశాఖ అధికారుల దౌర్జన్యాలు అరికట్టాలి

ప్రజాశక్తి పార్వతీపురంరూరల్

జిల్లాలోని సీతంపేట, నీలకంఠాపురం ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనులపై అటవీశాఖ అధికారులు దౌర్జన్యాలు ఆపాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగనాయుడు, ఆదివాసీ గిరిజన సంఘం ఉపాధ్యక్షులు కద్రక రామస్వామి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌కు వినతి అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కురుపాం, సీతంపేట ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనులు విస్తారంగా కొండచీపుర్లు సాగు చేస్తున్నారని, వీటిని కొనుగోలు చేయడానికి అటవీశాఖ వద్ద జిసిసి యాజమాన్యం ఒప్పందం చేస్తుందని, కానీ ఆ ఒప్పందం ప్రకారం గిరిజనుల వద్ద కొండచీపుర్లను జిసిసి కొనుగోలు చేయడం లేదని అన్నారు. దీంతో గిరిజనులు ప్రైవేట్ వ్యాపారులకు విక్రయిస్తున్నారన్నారు. అయితే ఫారెస్ట్ అధికారులు అడ్డుకుంటున్నారని, తిత్తిరి, జరడ, వబ్బంగి పంచాయతీల్లో గిరిజనుల నుంచి డబ్బులు అక్రమంగా కట్టించుకున్నారని ఇది అన్యాయం అని అన్నారు. అలాగే గిరిజనుల పట్టా భూముల్లో ఉన్న వంటచెరుకు కొట్టినా జరిమానాలు విధిస్తున్నారని తెలిపారు. అలాగే దండసూరలో గిరిజనులు ఇంటి కోసం ఇటుకుల తయారు చేసుకుంటే మట్టి తవ్విన దానికి వారి నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని అన్నారు. గిరిజనులపై దౌర్జన్యం చేస్తూ మామూలు వసూలు చేస్తున్న ఫారెస్ట్ అధికారులపై చర్యలు తీసుకొని జిసిసి ద్వారా కొండచీపుర్లు, చింతపండు, ఇతర అటవీ ఉత్పత్తులు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఇందుకు కలెక్టర్ స్పందిస్తూ అటవీశాఖ అధికారులను పిలిచి మందలించారని, ఇకపై గిరిజనులపై దౌర్జన్యం చేస్తే కేసులు పెట్టాల్సి వస్తుందని హెచ్చరించారని నాయకులు తెలిపారు.

గారమ్మకాలనీలో సిపిఎం ప్రజా చైతన్యయాత్ర

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక నగర పంచాయతీలోని గారమ్మ కాలనీలో సోమవారం సిపిఎం చేపట్టిన ప్రజా చైతన్య యాత్రలో నాయకులు పలు సమస్యలను అధ్యయనం చేశారు. ప్రజలు కూడా తమ సమస్యలను నేతల దృష్టికి తీసుకెళ్లారు. కాలనీలో 30 వీధులు ఉండగా, 10 వీధులకు మాత్రమే సిసి రోడ్లు ఉన్నట్లు గుర్తించారు. తాగునీరు సదుపాయం, వీధి దీపాల్లేవని గుర్తించారు. కాలువలు నిర్మించకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నట్లు పరిశీలనలో గుర్తించారు. గారమ్మ కాలనీతో పాటు నగర పంచాయతీలో సమగ్రంగా తాగునీటి సరఫరా జరిగేలా చర్యలు చేపట్టాలని, 15 రోజుల్లో ఈ సమస్య పరిష్కారం కాకపోతే నగర పంచాయతీ కార్యాలయాన్ని స్తంభిస్తామని నేతలు హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎం.తిరుపతిరావు, దావాలా రమణారావు, కె.రాము, డి.దుర్గారావు ఉన్నారు.

12న యువత పోరుకు రండి : రాజన్నదొర

ప్రజాశక్తి - సాలూరు

రాష్ట్రంలో పది నెలల టిడిపి పాలనలో చదువుతున్న విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్ లేదని, నిరుద్యోగ యువతకు భృతి కరువైందని మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర అన్నారు. సోమవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసిపి నియోజకవర్గ నాయకులతో కలిసి ఈనెల 12న జిల్లా కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న యువత పోరుకు సంబంధించిన గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ పది నెలల కాలంలో విద్యార్థులకు, నిరుద్యోగ యువతకు వెన్నుపోట్లు రుచి చూపించినట్లు చెప్పారు. నమ్మించి మోసం చేయడమెలాగో టిడిపి నాయకులు కళ్లకు కట్టినట్లు చూపించారని ఆరోపించారు. పదినెలల కాలంలో పేద విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్ కింద నిధులు మంజూరు చేయకపోవడంతో తల్లిదండ్రులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. సకాలంలో ప్రభుత్వం నుంచి ఫీజులు రాకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులపై ఒత్తిడి పెంచుతున్నారని చెప్పారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌లో ఫీజు రీయింబర్స్మెంట్ పథకానికి రూ.2600 కోట్లు కేటాయించారని, వాస్తవానికి రూ.3900 కోట్లు అవసరమని చెప్పారు. ఎన్నికల ముందు యువగళం పేరుతో మంత్రి నారా లోకేష్ ఊరూరా తిరిగి విద్యార్థులు, యువతకు లేనిపోని హామీలిచ్చి ఆశలు రేకెత్తించారని చెప్పారు. నిరుద్యోగ యువతకు రూ.3వేలు చొప్పున భృతి మంజూరు చేస్తామని హామీ ఇచ్చి మోసం చేశారని అన్నారు. లోకేష్ ఉత్తర ప్రగల్భాలకు ఆకర్షితులైన విద్యార్థులు, యువకులు ఇప్పుడిప్పుడే వాస్తవాలు గమనిస్తున్నారని చెప్పారు. విద్యార్థి, నిరుద్యోగ యువతకు జరుగుతున్న అన్యాయాన్ని నిరసిస్తూ ఈనెల 12న జిల్లా కలెక్టరేట్ వద్ద యువత పోరు ఆందోళన నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలో గల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, జడ్పీటీసీలు, కౌన్సిలర్లు, నాయకులు హాజరు కావాలని రాజన్నదొర కోరారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ, వైస్‌చైర్మన్ వంగపండు అప్పల నాయుడు, జెసిఎస్ కన్వీనర్ గిరిరఘు, వైసిపి నాయకులు పి.అప్పలస్వామి, పి.రామకృష్ణ, ఎం.అప్పారావు, కొల్లి వెంకటరమణ, కస్తూరి రామకృష్ణ పాల్గొన్నారు.

పోరుకు రండి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర

20మంది యువకులు వైసిపి లో చేరిక

పట్టణంలోని వెలంపేటకు చెందిన 20మంది టిడిపి కార్యకర్తలు రాజన్నదొర సమక్షంలో వైసిపిలో చేరారు. రాజన్నదొర నివాసంలో జరిగిన కార్యక్రమంలో కిలపర్తి ఓంకేష్, వి.ప్రేమ్, పూసర్ల దిలీప్ ఆధ్వర్యాన 20మంది యువకులకు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ, పట్టణ అధ్యక్షుడు వంగపండు అప్పలనాయుడు, జెసిఎస్ కన్వీనర్ గిరిరఘు, వైసిపి నాయకులు కొల్లి వెంకటరమణ, ఎం.అప్పారావు, పిరిడి రామకష్ణ, అప్పలస్వామి పాల్గొన్నారు.

పాలకొండ : ఈనెల 12న జిల్లా కేంద్రంలో తలపెట్టిన యువత పోరు పోస్టర్లను ఎమ్మెల్సీ విక్రాంత్ స్వగృహంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాలవలస విక్రాంత్ మాట్లాడుతూ విద్యార్థులకు ఇంతవరకు ఫీజు రీయింబర్స్మెంట్ వేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. పోస్టల్ ఆవిష్కరణలో మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, వైస్ చైర్మన్ రౌతు హనుమంతరావు, వెలమల మన్మథరావు, నీలాపు శ్రీనివాసరావు, నంబూరు సర్పంచ్ ఉపేంద్ర, దుంపల చిన్ని తదితరులు ఉన్నారు.

లక్షల్లో ఆదాయం.. సౌకర్యాలు శూన్యం

ఇదీ ఆర్టీసీ కాంప్లెక్స్ దుస్థితి

ప్రజాశక్తి -పాలకొండ

స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వివిధ రూపాల్లో లక్షల రూపాయాల్లో ఆదాయం వస్తున్నా కాంప్లెక్స్ నిర్వహణ మాత్రం అస్తవ్యస్తంగానే ఉంది. ప్రయాణికులు వచ్చిపోతుంటారులే... మాకే నష్టంలేదునకుంటేన్నారో ఏమో అధికారులు. కాంప్లెక్స్‌లో ప్రయాణికులకు సౌకర్యాలతో పాటు పరిసరాలను కూడా కనీసం పట్టించుకోవడంలేదు. ఏడాదికి రూ.12 కోట్ల ఆదాయం ఈ డిపో నుంచి వస్తున్నట్లు ఆర్టీసీ అధికారులే చెప్తున్నారు. షాపుల ద్వారా లక్షల్లో ఆదాయం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో వచ్చాయి. సుమారు 10 షాపు నుంచి నెలకు రూ.6 లక్షలకు పైగా ఆదాయం వస్తుంది. ఖాళీ స్థలం లీజకు ఇవ్వడంలో మరో అదనంగా 50 వేల వరకు వస్తుంది. ఈ డిపోలో 73 ఆర్‌టిసి బస్సులు, 18 అద్దె బస్సులు ఉన్నాయి. మొత్తంగా 91 సర్వీసులు ఈ డిపో పరిధిలో నడుస్తున్నాయి. రోజుకు వేలాదిమంది ప్రయాణికులు ఈ కాంప్లెక్స్ నుంచే రాకపోకలు సాగిస్తున్నారు. ఇంత ఆదాయం వస్తున్నా కాంప్లెక్స్‌ను మాత్రం అభివృద్ధి చేసిన దాఖలాల్లేవు. కాంప్లెక్స్ చుట్టూ ఉన్న చెట్లు పూర్తిగా ఎండిపోయి ప్రయాణికులకు చాలాదనాన్ని ఇవ్వడం పక్కన పెడితే ఎప్పుడు, ఎవరిపై కూలిపోయి ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. ఈ ప్రమాదంపై పలువురు ఎన్నిసార్లు అధికారుల దృష్టి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడం పట్ల ప్రయాణికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్ లో ప్రయాణికులకు అరకొర సౌకర్యాలు లభిస్తున్నాయి. కనీసం కూర్చోవడానికి బెంచీలు లేవు. లేవు ఫ్యాన్లు తిరగవు. మరుగుదొడ్లు ఉన్నా నీటి సదుపాయం లేకపోవడంతో నిరుపయోగంగానే ఉన్నాయి. ఆర్టీసీ కాంప్లెక్స్ అవుట్ గేటు దగ్గర ఆద మరిస్తే ప్రమాదం పొంచి ఉన్నట్లే. అక్కడ ఉన్న కల్వర్టు పూర్తిగా పాడవ్వడంతో ప్రయాణికులు ప్రమాదాలబారిన పడుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ఏ ప్రమాదం సంభవిస్తుందో తెలియక ప్రయాణికులు భయపడుతున్నారు. కాంప్లెక్స్‌కు వచ్చే వృద్ధులు, చిన్నారులు కూడా దీనివల్ల ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఆర్‌టిసి అధికారులు స్పందించి కాంప్లెక్స్‌లో మౌలిక సదుపాయాలు కల్పించి, సమస్యలను పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సౌకర్యాలు నోచని ఆర్‌టిసి కాంప్లెక్స్

బంగారు పతకాలు సాధించిన దీపక్, హర్షను అభినందిస్తున్న కోచ్, కరాటే చైర్మన్

జిల్లా స్థాయి కరాటే పోటీల్లో ఇద్దరికి బంగారు పతకాలు

ప్రజాశక్తి - సీతంపేట

ఈనెల 9న విజయనగరంలోని రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో జరిగిన ఇంటర్ జిల్లా స్థాయి కరాటే పోటీల్లో మండలంలోని పెద్దగూడ పంచాయతీ పరిధిలో గల అచ్చబ గ్రామానికి చెందిన. కొండింతల దీపక్, నిమ్మక హర్ష కటాఫ్ విభాగంలో ప్రతిభ కనబర్చి రెండు బంగారు పతకాలు సాధించారు. కోచ్ కొండింతల సందీప్, అల్లూరి సీతారామరాజు జిల్లా కరాటే చైర్మన్ ఎన్.రామారావు తెలిపారు.

బాసంగి పరిసరాల్లో సంచరిస్తున్న ఏనుగుల గుంపు

బాసంగి సమీపాన ఏనుగుల గుంపు సంచారం

ప్రజాశక్తి - కురుపాం

జియ్యమ్మవలస మండలం బాసంగి గ్రామ సమీపంలో గల అరటి, చెరుకు తోటల్లో ఏనుగుల గుంపు పంటలను నాశనం చేస్తున్నాయి. దీంతో రైతులు పంట పొలాల వద్దకు వెళ్లాలంటే భయాందోళన చెందుతున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా కొమరాడ మండలంలో సంచరించిన ఏనుగుల గుంపు మళ్లీ జియ్యమ్మవలస మండలంలోకి అడుగుపెట్టాయన్నారు. ఏనుగుల గుంపును దూరంగా అటవీ ప్రాంతానికి తరలించి పంటలను, ప్రాణాలకు రక్షణ కల్పించేలా అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు. అలాగే ఇప్పటివరకు జరిగిన పంట నష్టాలను అంచనా వేసి నష్టపరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నామన్నారు.

సీతానగరం : సర్వేను పరిశీలిస్తున్న ఎంపిడిఒ త్రివిక్రమరావు

సర్వేను పరిశీలించిన ఎంపిడిఒ

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని బూర్జ, పెద అంకలాంలో పి-4 సర్వేను ఎంపిడిఒ పి.త్రివిక్రమారావు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పి-4 సర్వేలో అన్ని రకాల ప్రశ్నలకు సమాధానాలు తీసుకొని ప్రభుత్వం పేదరిక నిర్మూలనకు కృషి చేస్తుందని ఇందులో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. అలాగే పెదంకలాంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఉపాధి కూలీలు నిర్ణీత సమయంలో పనిచేస్తే కూలి గిట్టుబాటవుతుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఉపాధి సిబ్బంది సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గరుగుబిల్లి : ప్రభుత్వం నిర్దేశించిన సమయంలోగా పి-4 సర్వేను పూర్తి చేయాలని ఎంపిడిఒ జి.పైడితల్లిని సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని కొత్త పల్లిలో చేపడుతున్న పి-4 సర్వేను సోమవారం ఆమె పరిశీంచారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయా శాఖల సమ న్వయంతో సమిష్టి భాగస్వామ్యంతో సర్వేను విజయవంతంగా పూర్తి చేసేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ పరిశీలనలో మండల పరిషత్ కార్యాలయ జూనియర్ సహాయకులు ఎన్.కులశేఖర్, గుంట్రెడ్డి కృష్ణప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి భూ దానం

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని మాతుమూరు గ్రీన్ ఫీల్డ్ రహదారి పక్కన ఉన్న 20 సెంట్లు భూమిని ఈశ్వర ఆలయ నిర్మాణానికి ఆగ్రామానికి చెందిన నైదాన కుటుంబం విరాళంగా ప్రదానం చేశారు. మాతుమూరుకు చెందిన మాజీ సర్పంచ్ నైదాన భారతి భర్త త్రినాధరావు అభిప్రాయంతో లక్షల రూపాయలు విలువ చేసే స్థలాన్ని ఆలయ నిర్మాణానికి అప్పగించామని స్థల దాత భారతి కుమారుడు హైకోర్టు లాయరు నైదాన శ్రావణ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు సోమవారం విరాళంగా ఇచ్చిన స్థలంలో గ్రామస్థులు నవధాన్యాలు జల్లారు. అలాగే గ్రామ పెద్దలు నిర్ణయం మేరకు మే 9న ఈశ్వర ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు హైకోర్టు లాయర్ నైదాన శ్రావణ్ కుమార్ దంపతులు నిర్ణయించారు.

పైపులైన్ లీకు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని చిదిమి గ్రామ ప్రధాన రహదారిలో పైప్ లైన్ లీక్ కావడంతో పల్లె ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. ఈ పైప్ లైన్ ద్వారా సిఎస్ఆర్ పేట, చిదిమి గ్రామాలకు తాగునీరు సరఫరా కావాల్సి ఉన్నప్పటికీ తరచుగా పైపు లైను లీక్ కావడంతో ఆ గ్రామాలకు పూర్తిస్థాయిలో తాగునీరందక ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి పైప్‌లైన్ మరమ్మతులు చేపట్టి పూర్తిస్థాయిలో తాగునీరందించేందుకు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

గిరిజన పంటలు ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి - పాలకొండ

గిరిజనులు పండించిన పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని గిరిజన సంఘ నాయకులు భానుచందర్, చంప తదితరులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహశీల్దార్ పి.బాలమురళీకృష్ణను కలిసి వినతిపత్రం ఇచ్చారు. 80 బస్తాల జీడి పిక్కలు రూ.16వేలకు జిసిసి ద్వారా కొనుగోలు చేయాలన్నారు. గిరిజనులు నివాసం ఉంటున్న ఈ ప్రాంతంలో ఉన్నత చదువులు చదువుకునేలా పీజీ కళాశాల ఏర్పాటు చేయాలన్నారు. ప్రాథమిక పాఠశాలలో 3,4,5 తరగతులు చదువుతున్న విద్యార్థులకు మూడు నుండి 6 కిలోమీటర్లు పరిధిలో మోడల్ స్కూల్‌లోకి తరలించే ప్రతిపాదన విరమించుకోవాలన్నారు. పాలకొండలో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మించాలన్నారు.

గర్భిణులకు తనిఖీలు

ప్రజాశక్తి- సీతానగరం

మండలంలోని పెద్ద అంకలాం, సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సోమవారం గర్భిణులకు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు పి ఉషారాణి, పి పావని, పి.లావణ్య గర్భిణులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. రక్తహీనత నివారణ కోసం గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ప్రతినెల చెకప్‌లు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది ఆర్ వరలక్ష్మి, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

ఘనంగా ఆమనగంటి జయంతి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ఉద్యోగ సంఘ నాయకులు అమనగంటి శ్రీరాములు జయంతి వేడుకలు సోమవారం పార్వతీపురం స్థానిక ఎన్జీవో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఉమ్మడి జిల్లా ఏపీ ఎన్జీవో సహ అధ్యక్షులు జివిఆర్ కిషోర్ మాట్లాడుతూ 74 ఏళ్ల క్రితం ఎపి ఎన్జీవో సంఘం స్థాపనలో ఆయన చేసిన కృషి మరువలేనిదన్నారు. అలాగే ఎన్జీవోలు అనుభవిస్తున్న ఎన్నో రాయితీలు వారి పోరాటాల వల్ల వచ్చినవేనని, ఉపాధ్యాయ, కార్మిక పెన్షనర్లు రాబోయే పోరాటాలకు ఇదే స్ఫూర్తితో వంద శాతం పనిచేసి ఆయన బాటలో నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏపీ ఎన్జీవో సంఘ నాయకులు పుష్ప, ఎం.శ్రీధర్, నర్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు చంద్రసాయి, ఎపిఎన్జీవో కార్యవర్గ సభ్యులు మంజుల, గణేష్ అధిక సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.

శ్రీరాములు చిత్రపటానికి నివాళ్లు అర్పిస్తున్న ఎన్‌జిఒ నాయకులు

జీడి పిక్కలకు మద్దతు ధర ప్రకటించాలి

ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్


వినతిని అందజేస్తున్న గిరిజన సంఘం నాయకులు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

జీడిపిక్కలకు మద్దతు ధర కేజీ రూ.200 ప్రకటించాలని ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఇన్‌ఛార్జి తహశీల్దార్ పి.కీర్తికి వినతిని అందజేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ గిరిజనులకు ప్రధాన ఆదాయ వనరుగా జీడి పిక్కల పంట మారిందని, మండలంలో సుమారు 200 ఎకరాల్లో గిరిజనులు జీడి సాగు చేస్తున్నారని అన్నారు. అయితే సరైన ధర ప్రభుత్వం ప్రకటించకపోవడంతో వారు దళారీల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఐటిడిఎ అధికారులు జీడిపిక్కా... బతుకు పక్కా అన్న నినాదంతో అందించిన జీడి మొక్కలను పెంపకానికి తమ ప్రధాన వనరుగా మార్చుకున్నామని, అయితే ఇప్పుడు దానికి గిట్టుబాటు ధర లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ఆందోళన వ్యక్తంచేశారు. కావున వెంటనే ప్రభుత్వం మద్దతు ధర జీడిపిక్కకు ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజనసంఘం జిల్లా ఉపాధ్యక్షులు కర్రక రామస్వామి, సభ్యులు పి రాము తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : జీడి పంటకు ప్రభుత్వం మద్దతు ధర కల్పించి, జిసిసి ద్వారా కొనుగోలు చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కోశాధికారి మండంగి రమణ కోరారు. ఈ మేరకు తహశీల్దార్‌కు వినతిని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎక్కువ శాతం మంది గిరిజనులు జీడి పంటనే నమ్ముకొని జీవనం సాగిస్తున్నారన్నారు. వేలాది ఎకరాల్లో జీడి పంట దిగుబడి వస్తున్నా ప్రభుత్వం కొనుగోలు లేక దళారుల బారిన పడి తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల్లో జీడి కొనుగోలు కేంద్రాలు, ప్రాసెసింగ్ యూనిట్లు చేయాలని, గిడిజనులకు ఉపాధి కల్పించాలని కోరారు. గుమ్మ లక్ష్మీపురం ఏజెన్సీలో గిరిజనులకు మెరుగైన వైద్యం అందడం లేదని, కావున స్థానికంగా మండల కేంద్రంలో 100 పడకల ఆసుపత్రి నిర్మించి, అన్ని సౌకర్యాలు కల్పించి మెరుగైన సేవలు అందించాలని కోరారు. అలాగే గిరిజన విద్యార్థులు ఉన్నత చదువులు చదవడానికి దూర ప్రాంతాలకు వెళ్ళాల్సి వస్తుందని, కావున గుమ్మలక్ష్మీపురంలో బిఇడి, డైట్ కళాశాలలు ఏర్పాటు చేయాలని సంఘం నాయకులు కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు మండంగి శ్రీనివాసరావు, బిడ్డిక శంకరరావు, బిడ్డిక ఆదిత్య, పువ్వల తిరుపతిరావు ఉన్నారు.

సాలూరు రూరల్ : జీడి పంటకు కనీస మద్దతు ధర రూ.200 ప్రకటించి, జీడీ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేసి నిరుద్యోగ గిరిజన యువతకు ఉపాధి కల్పించాలని కోరుతూ ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు తహశీల్దార్‌కు వినతి పత్రాన్నిఅందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు సీదరపు అప్పారావు, మండల అధ్యక్ష కార్యదర్శులు వంతల సుందర్రావు, గెమ్మెల జానకిరావు మాట్లాడుతూ మండలంలో సుమారు 4వేల మంది రైతులు 5500 ఎకరాల్లో జీడి పంటను పండిస్తున్నారని, ఎకరాకు 250 కేజీలు చొప్పున పంట దిగుబడి వస్తుందన్నారు. జీడికి కనీసం మద్దతు ధర కేజీకి రూ.200 ప్రకటించి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే మండలంలోని కురుకుటి, వెలగవలస గ్రామాల్లో జీడి ప్రాసెసింగ్ పరిశ్రమ యూనిట్లు ప్రారంభించి గిరిజన యువత ఉపాధి కల్పించి ఆదుకోవాలని కోరారు. గిరిజనులు సేకరిస్తున్న అటవీ ఉత్పత్తులకు కనీసం మద్దతు ధర కల్పించి కొనుగోలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల కమిటీ సభ్యులు చింత జోగయ్య, పోట్నంగి రాము, మెల్లిక అయోధ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు, మండల కార్యదర్శి తాడంగి గాసి తదితరులు పాల్గొన్నారు.

17,18 తేదీల్లో ఐటిడిఎ వద్ద ధర్నా

కొమరాడ : జీడి ప్రాసెసింగ్ సెంటర్లు వెంటనే ఏర్పాటు చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యులు హెచ్.రామారావు డిమాండ్ చేశారు. ఈనెల 17, 18 తేదీల్లో ఐటిడిఎ వద్ద 48 గంటల ధర్నా చేపడుతున్నట్టు తెలిపారు. ఈ మేరకు తహశీల్దార్‌కు వినతిని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ఐటిడిఎ పరిధిలో 8 మండలాల్లో గిరిజనులు 60వేల ఎకరాల్లో జీడి సాగు చేస్తున్నారన్నారు. గిట్టుబాటు ధర కల్పించేలా గుమ్మలక్ష్మీపురం, సాలూరు మండలాల్లో జీడి పిక్కల ప్రాసెసింగ్ సెంటర్ ఏర్పాటు చేసి గిరిజన పండించిన జీడి పంటతో పాటు ఇతర పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. సాగునీటి సమస్య పరిష్కరించాలని, గిరిజనులు సాగు చేస్తున్న పోడు భూములకు పట్టాలివ్వాలని, నిరుపేదలకు ఇళ్ల స్థలంతో పాటు ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి, గిరిజన సంఘం నాయకులు రామస్వామి, పోల్రాజు, వెంకటేష్, గిరిజన మహిళలు పాల్గొన్నారు.

సెంటున్నరకు పట్టా ఇస్తే ఐదు సెంట్లు ఆక్రమించుకుంటారా?

అక్రమ నిర్మాణదారులను ప్రశ్నించిన తహశీల్దార్
అందరికీ నోటీసులు.. కలెక్టర్‌కు నివేదిక

ప్రజాశక్తి - మక్కువ

ప్రభుత్వం పేదలకు ఇల్లు కట్టుకునేందుకు సెంటున్నర స్థలాన్ని కేటాయిస్తే సుమారు ఐదు సెంట్లు వరకు ఆక్రమించుకొని ఇల్లు నిర్మాణాలు చేపట్టేస్తారా అని తహశీల్దార్ షేక్ ఇబ్రహీం అక్రమ ఇళ్ల నిర్మాణదారులను ప్రశ్నించారు. మండలంలోని దబ్బ గడ్డ గ్రామంలో బీసీ కాలనీలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను ఆయన రెండోసారి సోమవారం పరిశీలించారు. కొన్నేళ్ల క్రితం సుమారు 4.90 ఎకరాల భూమిని గృహ అవసరాల కోసం ప్రభుత్వం కొనుగోలు చేసి కేటాయించిందని ఆయన అన్నారు. ఇందులో తమకు కేవలం ఆరుగురు మాత్రమే ఇల్లు కట్టుకునేందుకు అవకాశం కల్పించాలని దరఖాస్తు చేసుకున్నారని, ఆ ఆరుగురు ఎక్కడ కట్టుకున్నారు అన్నది కూడా పరిశీలన చేస్తామని చెప్పారు. ప్రస్తుతం బీసీ కాలనీలో స్థలాలు ఆక్రమించుకొని ఇష్టానుసారంగా అక్రమ నిర్మాణాల పరంపర కొనసాగుతున్న తీరుపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అందరికీ నోటీసులు అందజేసి వారం రోజుల్లో వివరణ కోరుతామని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన పట్టాల మేరకు స్థలాలను గుర్తించి మిగిలిన వాటిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని హెచ్చరించారు. ఖాళీ స్థలాన్ని కూడా ఈ సందర్భంగా సర్వే చేపట్టారు. ప్రభుత్వానికి అవసరమైన భవనాల కోసం సంప్రదిస్తే స్థలాన్ని కేటాయిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాసరావు, విఆర్ఒలు, సచివాలయ సర్వేయర్లు, స్థానికులు పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమానికి అధిక బడ్జెట్

ప్రజాశక్తి - కురుపాం

గిరిజన సంక్షేమానికి ప్రభుత్వం రూ.8,159 కోట్లు అధిక బడ్జెట్ కేటాయించడం గిరిజనుల తరపున ధన్యవాదాలు తెలుపుతున్నానని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. సోమవారం అంసెబ్లీలో ఆమె మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టిలకు 200 యూనిట్లు కరెంటు ఉచితంగా ఇవ్వడం, ఐటిడిఎ ద్వారా ట్రైకర్ లోనులు, డ్రిప్ ఇరిగేషన్ పథకాలు గిరిజనులకు ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. 544 గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలున్నాయని అన్నిట్లో ఏఎన్ఎం పోస్టులను నియమించాలని గిరిజన విద్యార్థులకు ఆరోగ్యం రక్షణ కల్పించాలని, గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం కోసం అటవీశాఖ నుంచి అనుమతులు ఉండేలా చర్యలు తీసుకోవాలని గిరిజన శాఖ మంత్రికి కోరుతున్నానని అన్నారు.

ప్రకృతి వ్యవసాయ సూత్రాలు రైతులకు చేరాలి

ప్రాంతీయ థిమోటిక్‌లీడ్ ప్రకాష్

ప్రజాశక్తి - గరుగుబిల్లి

రానున్న ఖరీఫ్‌లో ప్రకృతి వ్యవసాయ సార్వత్రిక సూత్రాలను ప్రతి రైతుకూ చేరేలా కార్యకర్తలు పనిచేయాలని ప్రాంతీయ థిమోటిక్ లీడ్ కె.ప్రకాష్ సూచించారు. మండలంలోని తోటపల్లి జట్టు ట్రస్ట్ కార్యాలయ ప్రాంగణంలో జట్టు వ్యవస్థాపకులు డాక్టర్ డి.పారినాయుడు అధ్యక్షతన కురుపాం, జియ్యమ్మ వలస, గుమ్మలక్ష్మీపురం మండలాలకు చెందిన 130 మంది ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలకు ఖరీఫ్ ప్రణాళిక తయారీపై 3 రోజుల శిక్షణా కార్యక్రమం సోమవారం నుంచి ప్రారంభించారు. ఖరీఫ్ ప్రణాళికలో ప్రతి రైతు వారి కుటుంబ సభ్యులతో కలిసి చర్చించి ప్రణాళిక రూపొందించాలనీ ఆ సమాచారాన్ని ఊర్వీ యాప్‌లో నమోదు చేయాలని, సార్వత్రిక సూత్రాల్లో గల ఇతర సూత్రాలను తప్పనిసరిగా పాటించాలని, రైతులు వద్ద ఉన్న నవధాన్యాలు, లేని విత్తనాలను మహిళా సంఘాలు లేదా ఎఫ్‌పిఒ సహకారంతో సిద్ధం చేసుకోవాలన్నారు. సిలబస్ డెవలప్మెంట్ సీనియర్ కన్సల్టెంట్ పారి నాయుడు మాట్లాడుతూ భావి తరాలకు ఆరోగ్యకరమైన ఆహారం అందించాలన్నారు. ఈ తరానికి మనం తినే ఆహారం ఎక్కడ నుండి వస్తుంది తెలియాలంటే వారికి బాల్యంలోనే వ్యవసాయ సాగుపట్ల అవగాహన కల్పించాలని అందుకోసం సిలబస్ రూపొందిస్తున్నామని తెలిపారు. పాఠశాల, అంగన్వాడీ ప్రాంగణాలలో కిచెన్ గార్డెన్ వేసుకోవడం వాటినుండి వచ్చిన ఉత్పత్తులను మధ్యాహ్నం భోజనం పథకంలో వినియోగించుకోవడం వలన ఆరోగ్యాలు బాగుంటాయని, అందుకు ఉపాధ్యాయులు, తల్లి దండ్రులు, కార్య కర్తలు సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో బడి నుండి పొలం బడికి సిలబస్ కన్సల్టెంట్ తుంబలి శివాజీ, ఎన్ఎఫ్ఎలు జి.అన్నపూర్ణ, శారద, తిరుపతి, ముసలయ్య, దేవీప్రసాద్, అంబోజీ, సత్యం నారాయణ, మాష్టర్ ట్రైనీలు స్వామి నాయుడు, శ్రీరామ్, నరసింహ, నిర్మల, మూడు మండలాల ఎల్ 1, ఎల్ 2,ఎల్ 3 కార్య కర్తలు పాల్గొన్నారు.

ఫర్నీచర్ నెపంతో పరీక్షా కేంద్రం రద్దు అన్యాయం

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

సీతానగరం మండల కేంద్రంలో గల జిల్లా పరిషత్ హైస్కూల్ కేంద్రంగా గత కొన్నేళ్లుగా నిర్వహిస్తున్న పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని ఎత్తివేయడం అన్యాయమని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కె.డేవిడ్ అన్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ ఎం శ్యాం ప్రసాద్ కు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా డేవిడ్ మాట్లాడుతూ ప్రస్తుతం త్రిమెన్ కమిటీ నివేదిక ఆధారంగా ఫర్నీచర్ లేనందున పరీక్షా కేంద్రం అనవసరం లేదన్నట్టు జిల్లా అధికారులకు నివేదించడంతో పరీక్ష కేంద్రాన్ని పూర్తిగా రద్దు చేశారని, ఇది వందలాది విద్యార్థులకు భవిష్యత్తని తెలిపారు. మండల కేంద్ర పాఠశాల అభివృద్ధికి ఉపాధ్యాయులు ఉమ్మడిగా పాఠశాలలో ఫర్నిచర్స్ లేనప్పటికీ ఇతర పాఠశాలల నుండి ఫర్నిచర్ తీసుకుని వచ్చి పరీక్ష కేంద్రాన్ని నిర్వహించే వారని, నేడు అదే విధంగా పరీక్ష నిర్వహిస్తామని హెడ్మాస్టర్ తెలిపినప్పటికీ పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని ఎత్తివేయడం హేయమైన చర్యని ఆందోళన వ్యక్తం చేశారు. ఫర్నీచర్ లేకుంటే ప్రత్యామ్నాయ మార్గంతో పరీక్ష కేంద్రాన్ని నిర్వహించలే తప్ప, కేంద్రాన్ని ఎత్తివేయడం దుర్మార్గమని ఆందోళన వ్యక్తంచేశారు. ఇకనైనా పాఠశాల అన్ని తరగతులకు శాశ్వత ఫర్నీచరను ఏర్పాటు చేయాలని, రానున్న విద్యా సంవత్సరం నుంచి యధావిధిగా పరీక్షా కేంద్రాన్ని కేటాయించాలని డిమాండ్ చేశారు. లేకుంటే విద్యార్థులతో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు పి.రాజశేఖర్ పాల్గొన్నారు.

అన్ని రంగాల్లోనూ మహిళల అభివృద్ధి

ప్రజాశక్తి- సాలూరు రూరల్

మహిళలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందినప్పుడే దేశం కూడా అభివృద్ధి చెందుతుందని ఎఒ అనురాధ పండా తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల సందర్భంగా అన్నమరాజవలస పంచాయతీ పందిరిమామిడివలసలో ఆర్ష్ సంస్థ భాగస్వామ్యంలో నాబార్డ్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. నేడు సమాజంలో మహిళలు ఏ రంగాలలో చూసిన అభివృద్ధి సాధిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో అన్నమరాజు సర్పంచ్ చీమల రాములమ్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మి, ప్రమీల మహిళా ఉద్యోగులు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్స్, ఆర్ష్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు, గ్రామస్తులు, ఎఫ్‌పిఒ సభ్యులు పాల్గొన్నారు.

రబీ పంట నమోదు తప్పనిసరి

ప్రజాశక్తి- సీతానగరం

రబీ పంటలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ఎఒ అవినాష్ కోరారు. మండలంలోని పనుకుపేటలో సోమవారం రైతులకు రబీ పంట నమోదు, సామాజిక తనిఖీ కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులు వేసిన పంట పేరు, విస్తీర్ణం చదివి వినిపించి ఏమైనా తప్పు ఒప్పులు ఉన్నాయా లేదా సరి చూసుకోవాలని తెలిపారు. రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఇప్పటి వరకు 9,583 రైతులు మండలంలో రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, ఎఇఒ, రైతులు పాల్గొన్నారు.

సంత మార్కెట్ వద్ద సంకల్పం

ప్రజాశక్తి - సీతంపేట

మండల కేంద్రమైన సీతంపేట వారపు సంత మార్కెట్ వద్ద పోలీసుల ఆధ్వర్యంలో సంకల్పం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రైనీ ఎస్సైలు, ఎఎస్ఐ సంజీవ్ సైబర్ నేరాలు గురించి సంతకు వచ్చిన యువతకు ప్రజలకు అవగాహన కల్పించారు. హెల్మెట్ గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీతంపేట పోలీసులు ఉన్నారు.

పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

కొమరాడ పోలీస్ స్టేషన్ పరిధిలో అపహరణ, పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్లకఠిన కారాగార శిక్ష, రూ.13వేలు జరిమానా న్యాయస్థానం విధించినట్లు ఎస్పీ ఎస్‌వి మాధవ్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాల్లోకి వెళ్తే కొమరాడ మండలం విక్రాంపురానికి చెందిన కోరాడ రామారావు కొమరాడ స్కూల్‌లో చదువుతున్న విద్యార్థి తన గ్రామానికి రావడానికి బస్సు కోసం ఎదురు చూస్తోంది. రామారావు బండిపై వచ్చి ఆ విద్యార్థినిని తన వాహనం ఎక్కుంచుకొని రాయగడ, అక్కడ నుంచి విజయవాడ తీసుకెళ్లి అక్కడ తనకు తెలిసిన వారి ఇంట్లో ఉంచి విద్యార్థినిపై అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం విద్యార్థినిని తిరిగి తన ఇంటిదగ్గర్లో విడిచిపెట్టి వెళ్లాడు. ఈ మేరకు బాధితురాలు కొమరాడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, అప్పటి ఎస్సై జగదీశ్ నాయుడు కేసు నమోదు చేశారు. అనంతరం డిఎస్పీ సుభాష్ ఈ కేసును దర్యాప్తు చేసి, నిందితుడ్ని అరెస్టు చేశారు. దర్యాప్తు అనంతరం కోర్టులో తగిన సాక్ష్యాధారాలతో అభియోగ పత్రం దాఖలు చేశారన్నారు. ఈ కేసు విచారణలో నిందితుడిపై నేరారోపణలు రుజువు కావడంతో సదరు నిందితుడుకి 20 ఏళ్లకఠిన కారాగార జైలు శిక్ష, రూ.13వేలు జరిమానా విధిస్తూ స్పెషల్ పోక్సో కోర్ట్ (విజయనగరం) జడ్జి కె.నాగమణి సోమవారం తీర్పు వెల్లడించారు.

బిల్లుల అందక కాంట్రాక్టర్లు లబోదిబో

ప్రజాశక్తి - సాలూరురూరల్

ఉపాధి హామీ పథకం కింద గ్రామాల్లో పల్లె పండుగ పేరుతో కూటమి ప్రభుత్వం సిసి రోడ్లు, డ్రైనేజీలకు పుష్కలంగా నిధులు ఉన్నాయని, పనులు ఎవరు చేసినా వారం, పది రోజుల్లో బిల్లులు చెల్లిస్తామని స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు చెప్పినప్పటికీ నేటి వరకు బిల్లులందక గుత్తేదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రతి గ్రామంలో మౌలిక సదుపాయాల నిమిత్తం సిసి రోడ్లు, డ్రైనేజీలను నిర్మించడానికి కూటమి ప్రభుత్వంకంకణం కట్టుకున్నది ఎంతో గొప్పగా ప్రచారం చేసుకుంది. అక్కడి వరకు బాగానే ఉంది. ఈ పనులు ఎంత తొందరగా చేస్తే అంత తొందరగానే బిల్లులు చేస్తామని చెప్పడంతో తమ ప్రభుత్వంలో ఇంతక ముందు ప్రభుత్వం వలె బిల్లులకు ఇబ్బందులు ఉండవని గుత్తేదారులు అప్పులు చేసి మరీ ఈ పనులు మొదలుపెట్టారు. తీరా పనులు పూర్తయ్యాక బిల్లులు అందక, తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టకలేక లబోదిబోమంటూ తమ

నిర్మాణం పూర్తయినా బిల్లులు అందని సిసి రోడ్డు

బాధలను ఎవరికి చెప్పుకోవాలో, ఏం చేయాలో అన్న సందిగ్ధ స్థితిలో ఉన్నారు. ముఖ్యంగా ఉపాధి హామీ మెటీరియల్ కంపొనెంట్ కింద జరిగిన పనులకు, బిల్లులకు ఇబ్బందులు ఉండవన్న ధీమాతో అధికారులు చెప్పిన నిర్దిష్ట సమయంలో పనులు ముగించారు. తీరా పనులు చేసి ఇప్పుడు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా బిల్లులు మాత్రం చెల్లించడం లేదని వాపోతున్నారు. మండలం మొత్తం మీద దాదాపు రూ.2.20కోట్లు పనులు జరిగినా, వీటికి సంబంధించిన బిల్లులు మంజూరు కాలేదు. డిసెంబర్ రెండు, మూడు వారాల్లో పనులు ముగించినా మార్చి చివరికి వస్తున్నా ఇప్పటి వరకు బిల్లులు చెల్లించకపోవడంతో నిధులు మరుగున పడతాయన్నది మరో భయంతో ఉన్నారు. డిసెంబర్ 31వ నాటికి నిధులు ఖర్చు చేయాలని అధికారులు కాంట్రాక్టులపై ఒత్తిడి తెచ్చి మరి ఆ పనులు చేయించినా నేటికీ ఆ పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరిగిపోతాయన్న భయంతో కాంట్రాక్టులు విలవిలాడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు స్పందించి తక్షణమే బిల్లులు ఇప్పించాలని కాంట్రాక్టర్లు కోరుతున్నారు.

అప్పలనాయుడు కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రానికి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయులు లెంక అప్పలనాయుడు మృతి చెందారని విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే వి.కళావతి సోమవారం కుటుంబాన్ని పరామర్శించారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. వీరితో పాటు ఎంపీపీ డి వెంకటరమణ నాయుడు, భోగి మాణిక్య చంద్రశేఖర్, ఎస్ శ్రీనివాస్ రావు, జి మహేష్, ఆర్ నాగేశ్వరరావు, ఏ రవికుమార్ ,పి ధవలేశ్వర రావు తదితరులు ఉన్నారు.

జి.శివడ జంక్షన్‌లో వాహన తనిఖీలు

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో జి.శివడ జంక్షన్ వద్ద సోమవారం సాయంత్రం నీలకంఠపురం ఎస్ఐ నీలకంఠరావు వాహనాలు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ధ్రువీకరణ పత్రాలు లేని వాహనదారులకు, పరిమితికి మించి ఆటోలలో ప్రయాణికులను ఎక్కించిన వారికి అపరాధ రుసుం వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని అన్ని ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండి మద్యం సేవించకుండా వాహనాలు నడపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కాండం తొలుచు పురుగు పట్ల అప్రమత్తం

ప్రజాశక్తి - పాచిపెంట

రబీ సీజన్లో వరి నాట్లు ఆలస్యంగా వేసినట్లయితే కాండం తొలుచు పురుగు ఆశిస్తుందని, కావున కాబట్టి రైతులు నివారణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి కె.తిరుపతిరావు అన్నారు. మండలంలోని చెరుకుపల్లిలో గ్రామ వ్యవసాయ సహాయకులు కె.నాగమణితో కలిసి వరి పొలాలను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పీక పురుగు, కాండం తొలుచు పురుగు వరి పంటను ఆశించిందని, తల్లి రెక్కల పురుగు ఆకు చివర్లలో గుంపులుగా గుడ్లు పెడుతుందన్నారు. దీని నివారణకు కార్ టాప్ హైడ్రోక్లోరైడ్ అనే మందును లీటరు నీటికి రెండు గ్రాములు కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. లేకుంటే అగ్ని అస్త్రం ఎకరానికి ఐదు లీటర్లు పిచికారీ చేసుకోవాలని, పంట బాగా తడిచేలా చూడాలని తెలిపారు. అంతేకాకుండా ఎంటియు 1010 రకానికి అక్కడక్కడ అగ్గి తెగులు సోకిందని, నివారణకు ట్రై సైకలాజోల్ అనే మందును లీటర్ నీటికి ఒక మిల్లీలీటరు మందు కలిపి పిచికారీ చేసుకోవాలని తెలిపారు. ఈ దశలో పీకపురుగులు నివారించుకోకపోతే కంకి వచ్చిన తర్వాత గింజలు నిండుకోకుండా కంకి వస్తుందన్నారు. కావున నివారించుకోవాలని తెలిపారు.

యువతకు సివిల్స్ ఫ్రీ కోచింగ్ ఇవ్వండి

ప్రజాశక్తి - పార్వతీపురం

స్థానిక ఐటిడిఎ పరిధిలోని గిరిజన నిరుద్యోగ యువతకు ఉచిత సివిల్స్ శిక్షణ కార్యక్రమం నిర్వహించాలని గిరిజన విద్యార్థి సంఘం నాయకులు పల్లా సురేష్, జె.బంగార్రాజు కోరారు. సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ సెల్‌లో వారు ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీ వాత్సవకు వినతిపత్రం అందజేశారు. సరైన శిక్షణ కార్యక్రమం లేక గిరిజన నిరుద్యోగ, యువకులు ఉన్నత ఉద్యోగాలు పొందలేకపోతున్నారని చెప్పారు. పాడేరు ఐటిడిఎలో ఉచిత సివిల్స్ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారని, ఇక్కడ కూడా నిర్వహించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి కురుపాం / గరుగుబిల్లి

గరుగుబిల్లి మండలం సుంకి గ్రామ సమీపంలో సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. స్థానికులు అందించిన వివరాలిలా ఉన్నారు. కురుపాం మండలం గుమ్మ గ్రామానికి చెందిన కె.హరి (26), లాభాల గౌరీ శంకర్, కె.శ్రీనివాసరావు తమ బంధువులను పార్వతీపురం తీసుకెళ్లి తిరిగి గుమ్మ గ్రామానికి వస్తున్నారు. ఈ నేపథ్యంలో కర్రలలోడుతో పార్వతీపురం వెళున్న లారీ సుంకి గ్రామ సమీపాన ఎదురుగా వస్తున్న కారును ఢీకొంది. ఈ సంఘటనలో కారు డ్రైవింగ్ చేస్తున్న హరి అక్కడికక్కడే మృతి చెందగా, మిగతా ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. హరికి ఆరు నెలల క్రితమే పెళ్లయింది. భార్య, తల్లిదండ్రులు ఉన్నారు. గరుగుబిల్లి ఎస్సై రమేష్ నాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదంలో మృతి చెందిన హరి

సికిల్ సెల్ ఎనీమియాతో యువకుడు మృతి

ప్రజాశక్తి -సీతంపేట

సీతంపేటకు చెందిన తొందర కిరణ్ సాయి (23) సోమవారం విజయనగరం ఎంఆర్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. గత కొంతకాలంగా సికిల్ సెల్ ఎనీమియాతో బాధపడుతున్నాడు. కిరణ్ సాయి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. తండ్రి వేణు ఆర్టీసీలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు.

పాముకాటుతో మహిళకు అస్వస్థత

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలో దాసుగుమ్మడకు చెందిన చనోరమ్మ పాము కాటుకు గురై అస్వస్థకు గురైంది. గ్రామంలో జీడి పంట పనులు చేస్తుండగా పాము కాటు వేసింది. స్థానికులు సహాయంతో సీతంపేట ఏరియా ఆసుపత్రిలో చేర్పించారు. దీంతో సీతంపేట ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది